# వాయులీనం

రాజ్యానికి వొంటిమీద స్పృహ పూర్తిగా తప్పిపోయింది. అది ఈ ప్రపంచంలో లేదు. వెంకటప్పయ్య ప్రాణాలు ఎక్కడివక్కడ ఎగిరి పోయాయి. పరీక్షగా పెళ్ళాం మొహంలోకి చూశాడు.

రాజ్యం పెదిమలు కదులుతున్నాయి. ఏవో మాటలు అంటున్నట్టుంది. మాటలు పైకి రాకపోయినా మనస్సులో ఏదో అనుకొంటున్నది.

"వొసే రాజ్యం!" అని ఆదుర్దాగా పిలిచేడు. అది పలకలేదు. అది ఈ ప్రపంచంలో లేదు. మనోహరమైన తోడిరాగాన్ని తోడుపుచ్చుకొని అంబరవీధుల్లో విహరిస్తున్నది.

వసారాలో పిల్లలు గందరగోళం చేస్తున్నారు.

"వెధవల్లారా ఏమిటా అల్లరి!" అని గట్టిగా పిల్లల్ని వెంకటప్పయ్య కసిరాడు. పిల్లలు దగ్గరగా ఉంటే చావకొట్టేవాడే.

"అబ్బ తుళ్ళిపడ్డానండీ! పిడుగుపడ్డట్టు పిల్లలమీద అలాగ విరుచుకు పడుతున్నారేం?" అని రాజ్యం తెలివి తెచ్చుకొని అడిగింది. కళ్ళు చిట్లించి మొగుణ్ణి చీదరగా చూసింది.

"నీ వంట్లో ఎలాగుందో చెప్పు" అని ఆత్రుతగా అడిగాడు.

"వాళ్ళ నెందుకలా కసిరారు?"

"కసిరితే కసిరాను. ముందు నీ వంట్లో ఎలాగుందో చెప్పు"

"నిక్షేపంలాగుంది. ఇప్పుడేమొచ్చిందని?"

"పిలిస్తే పలికేవా మరి?"

"పిలిచారా?"

"పిలవలేదూ మరి?"

"అలాగనా!" అని రాజ్యం నవ్వింది. దాని నవ్వు మొహం చూడ్డానికి భయంకరంగావుంది. పైకి వచ్చేసిన గుడ్లగూబ కళ్ళు, ముందుకు పొడుచుకు కనబడుతున్న ముందు పళ్ళు మొహాన్ని బీభత్సం చేశాయి.

"వాళ్ళు మరచిపోయానండీ!" అని రాజ్యం మళ్ళా నవ్వింది.

"అంతేకదా!" అని వెంకటప్పయ్య కాస్తంత కుదుట పడ్డాడు. రాజ్యం టైఫాయిడ్ జ్వరంతో తీసుకొని తీసుకొని కిందపెట్టవలసినంతా అయి బతికిబట్టకడుతున్నది. పత్యంతింటూ, ఇంకా వారంరోజులే అయింది. వెంకటప్పయ్యకి అదురుమాత్రం పోలేదు. ఆ మాయదారి టైఫాయిడు జ్వరం మూడు వారాలుగా పొక్కి పోసిన తరువాత దిగజారలేదు. మళ్ళా తిరగబెట్టింది. మరి మూడు వారాలుచూడు నా మహాత్యం అని ముప్పు తిప్పలూ పెట్టింది. పత్యం పెట్టించినా, ఆసుపత్రినుంచి ఇంటికి తీసుకొచ్చినా, వెంకటప్పయ్యకి పక్క బెదురు అలాగనే ఉండిపోయింది. ఏ క్షణంలోనైనా దాని ప్రాణం గుటుక్కుమంటుందనే వాడి భీతి!

"నా వంట్లో హాయిగా ఉంది. తింటున్నది అరుగుతున్నది. నిద్ర పడుతున్నది. అంతజబ్బుపడ్డాక నిలుచున్న పాళంగా మామ్మూలు మనిషిని కమ్మంటే అవుతానా?" అన్నది రాజ్యం.

రాజ్యాన్ని చూస్తే మాత్రం దానివంట్లో ప్రాణాలు ఎలాగ నిలబడి ఉన్నాయా అని ఆశ్చర్యం వేస్తుంది. కండయావత్తూ అర్చుకుపోయి ఎమికెలమీద తోలుమాత్రం మిగిలి వున్నది.

"నువ్వు పరధ్యానంగా ఉంటే గుండెలార్చుకు పోయాయి" అన్నాడు. నిద్రపోతున్న పెళ్ళాన్ని చూశాడా — ప్రాణం ఉందా లేదా అనే సంకోచం వాణ్ణి ప్రతీరోజూ పీక్కు తింటూ ఉండడం, దాని కడుపు కిందికీ మీదికీ ఊపిరికి ఎగురుతూ ఉంటే బతికే ఉన్నదని నిర్ధారణ చేసుకొంటూ ధైర్యపడడం వాడికి పరిపాటి అయిపోయింది.

"మనస్సు ఎటో పోయింది. నావంట్లో మరేం లేదు. ఈ యింటికి మారిన దగ్గరనుంచే నాకు హాయిగా ఉంది" అన్నది రాజ్యం.

"నాకూ ఈ యింటికి వచ్చిన దగ్గరనుంచి హాయిగా ఉంది. ఏదో కొత్త సంతోషం కలుగుతున్నది. ఎటొచ్చి అద్దె కాస్త ఎక్కువనుకో" అన్నాడు.

"అద్దెకే బెంగగా ఉంది" అన్నది రాజ్యం.

"ప్రాణానికే క్షేమంలేని తరవాత వెధవ అద్దెకు చూసుకొంటామా? ఏ బెంగా వద్దు" అన్నాడు. అంతకుముందు వాళ్ళు ఇరుకు సందులో ఇక్ష్వాకులనాటి పాతగూభ్యంలో అద్దె చవకని ఉండేవారు. అక్కడ ఉన్నన్నాళ్ళు ఇంటిల్లిపాదికీ రోగాలే. ఆఖరికి రాజ్యానికే ప్రాణం మీదికొచ్చింది. మనిషి తోడు లేనివాడు. ఆస్పత్రిలో పెళ్ళాన్నుంచి యమయాతన పడ్డాడు. కట్టుకొన్న మొగుడు, కనుకొన్న పిల్లలు అదృష్టవంతులు కావడాన్ని బతికి మనుషుల్లో పడ్డది. ఇప్పుడు కొత్తగా కట్టిన సిమెంటు డాబాలో రెండు చిన్న గదులూ, వసారా అద్దెకు తీసుకొన్నారు. ఎదురుగుండా చూడముచ్చటైన మేడ ఉన్నది. ఇళ్ళచుట్టూ విశాలంగా పెరళ్ళున్నాయి. పెరళ్ళన్నీ ఉద్యానవనాలే!

"వెధవ డబ్బు ఏదో కూడిక చేసుకొంటాము. నువ్వు బతికావు. అంతేచాలు" అన్నాడు.

"అదేమన్న మాటలెండి. నా జబ్బుకి ఎక్కణ్ణుంచి తెచ్చారో, ఎంత అయిందో ఇప్పటికి నాకు చెప్పకుండా ఉన్నారు. అదీ ఆలోచించుకోవాలి" అన్నది.

"ఆ వూసు నిన్నెత్తొద్దన్నానా? ముందు నీ ఆరోగ్యం చూసుకో. నువ్వేమీ లోభపడకు. కావలసినంత ఓవల్టిన్ను తాగు. తెచ్చిన పళ్ళన్నీ తినెయ్యి. పిల్లలకికూడా పెట్టకు."

"తినకేం చేస్తున్నాను? కాళ్ళు జాపుకొని మీ చేత వండించుకొని షురీ తింటున్నాను. ఏదైనా అప్పు అప్పేకదా? మనకింకో విధం ఉంది కనకనా?"

"ఆ వూసు ఎత్తొద్దన్నానా?" అన్నాడు. డబ్బు మాటెత్తగానే వాడికి గాభరా పుట్టింది. జీతం రెండు నెలలదీ కాక రెండువందలకి దాటి ఖర్చు అయిపోయింది. డాక్టరు అశ్వనీదేవతలాగా కాణీ పుచ్చుకోకుండా కాపాడుకొచ్చినా వుత్తమందులకి అయిపోయింది. ధర్మాసుపత్రిలో పడేసినా తలకి మించిన ఖర్చు అయింది.

"ఎత్తనులెండి. తీర్చుకొందాం తాపీగా. కూడికకి ఏముంది? నా చేతిలోనే ఉంది."

"సరేలే అలాగే చేతువుకాని" అని వెంకటప్పయ్య పెరట్లోకెళ్ళి పోయాడు. వాడికా సంభాషణ పెంచటం ఇష్టంగాలేదు. కాళ్ళూ, చేతులూ, మొహం కడుక్కొని వచ్చాడు. తల దువ్వుకొని దుస్తులేసుకొన్నాడు. వీధిలోకి బయలుదేరాడు.

రాజ్యం మళ్ళా ఈ ప్రపంచంలో లేదు. చిరిచీకటి గదిలోకి ప్రవేశిస్తున్నది. కిటికీలోంచి సాయంకాలపు వెల్తురు రాజ్యం మొహంమీదపడి బంగారపు పూత పూస్తున్నది.

వెంకటప్పయ్య రాజ్యం మొహాన్ని తదేకంగా చూస్తూ నిలబడ్డాడు. వాడికి భయం మరి కలగలేదు. చిన్ననాటి ఏ మధుర సన్నివేశాన్నో జ్ఞప్తికి తెచ్చుకొని వొళ్ళు పరవశమౌతున్నదనుకొన్నాడు. మొహంలో దేదీప్యమానంగా సంతోషం తాండవిస్తున్నది.

కొన్ని సంవత్సరాలై రాజ్యం అంత సంతోషంగా ఉండటం వెంకటప్పయ్య చూడలేదు. కాపరానికొచ్చిన తొలి సంవత్సరం ఇరవై నాలుగు గంటలూ కిలకిల నవ్వుతూ, బంతిలాగ తుళ్ళిపాట్లుపడుతూ ఉండేది. సంవత్సరం తిరక్కుండా దాని గుండెలికి చంటికుర్రాణ్ణి వప్పగించి సంసార సాగరాన్ని ఉత్తరించుకువెళుతూ, అవతలదరికి చేరమంది జీవితం! కాపరానికొచ్చి ఆరేళ్ళయింది. ముగ్గురు కొడుకులతల్లి అయి ఈదుతున్నది.

అకస్మాత్తుగా రాజ్యం నోరుతెరచింది. తల వోపక్కకిపెట్టి ఆడిస్తున్నది. దానిచేష్టకి వెంకటప్పయ్య పకాలున నవ్వాడు. ఆ నవ్వు కొంత దగ్గులాగా వాణ్ణి వొహంతకుగాని వదలిపెట్టలేదు. రాజ్యం విహాయస వీధుల్లోంచి ఆ నవ్వుతో భూమ్మీదికి వచ్చేసింది.

"ఎందుకూ అంత విరగబాటునవ్వు?" అని మొగుణ్ణడిగింది.

"ఏదీ మళ్ళా నోరు సాగదీసి, మెడవంచి ఆడించు చూస్తాను" అన్నాడు.

"అదా! ఎదురింటిపిల్ల పాడుతున్నది. వినండి" అన్నది. రాజ్యం చెప్పేక ఎదురింటినుంచి సంగీతం వస్తున్నట్లు చెవులకు తెలిసింది. చెవుల్లో గుయ్యిఁగుయ్యిఁమంటున్నా అదేమిటో తెలుసుకోవలసిన అవసరం వాడికి అంతవరకూ కలగలేదు!

"ఓహో ఇక్కడ సంగీతం వినబడుతున్నదే! అదియా సంగతి. చిన్నప్పుడు నువ్వు చిన్న వాయులీన విద్వాంసురాలివి కదూ! మరచి పోయాను" అన్నాడు.

కామవర్ధని రాగాలాపనతో కంపిస్తూ, పువ్వు వెలగవాసనతో మత్తెక్కి గాలి బరువుగా గదిలోకి ప్రవేశిస్తున్నది.

"ఏమర్రోయ్ పిల్లలూ ఇక్కడ సంగీత కచేరి అవుతున్నది. వచ్చి వినండి" అన్నాడు. కొడుకు లిద్దరూ వీధిలోకికూడా పోయి పాట ఆశ్చర్య చకితులై వింటూ నిలబడ్డారు.

"ఈ యింట్లో సుఖంగా ఉందనుకొన్నాను. కాని ఈ పార్శ్వశూల తప్పదులాగుంది" అన్నాడు.

"శొంఠికొమ్ము తెచ్చుకోండి" అన్నది రాజ్యం. అతని మనస్సు చివుక్కుమంది. శొంఠి గంధం పూసినట్టు వొళ్ళంతా సెగలూ పొగలూ లేచాయి.

"చీకటి పడుతూ ఉంటే ఇప్పుడెందుకూ వీధిలోకి? పెందరాళే అన్నం తినకూడదూ?" అన్నది.

"అనుకొంటూ ఉండగా ఆలస్యమైపోతున్నది. ఇలాగ్గా ఇహనెళ్ళి పాపపరిహారార్థం ఇక మంచిపని చెయ్యాలి" అన్నాడు.

"పాపాలుకూడా చేస్తున్నారా?"

"పాపం చెయ్యందీ బతుకు వెళ్ళలేదు."

పిల్లలిద్దరూ సంగీతం జాగ్రత్తగా వింటున్నారు. వాళ్ళకి శ్రవణా నందంగానే ఉందిగాబోలు. పిల్లల హృదయాలు నిష్కల్మషంగా ఉంటాయి. స్వభావసిద్ధంగా సంగీతం సమ్మోహ పరుస్తుంది. చిన్న వయస్సునుంచి కాస్తంత రాగతాళ జ్ఞానం కలిగిస్తే జీవితంలో సంగీతం ప్రవేశించి ఆజ న్మాంతం ఆనంద హేతువు అవుతుంది.

"ఓహో మీరు మీ అమ్మకి పిల్లలే. సరిగమల సాంబారు మీకు వచ్చి నట్టుందే!" అని వెంకటప్పయ్య వీధిలోకి నడిచాడు.

రాజ్యం మెల్లిగాలేచి స్విచ్చి నొక్కింది. దూలాల మధ్యనున్న గొట్టం క్రమేణా వెలిగి గదినిండా ఆణిముత్యంలాగ కాంతిపడ్డది. విద్యు

ద్దీపాలు సిమెంటుడాబా గదుల్లో ఉన్నంత అందంగా పూర్వకాలపు నాలు గిళ్ళ లోగిళ్ళలో శోభించవు. బూజుపట్టిన పెణకకింద, పట్లతో నిండిన బల్బులా రాజ్యం సంగీతం రెండురోజులు వెలిగి ఫ్యూజు అయిపోయింది. దాని ఫిడేలు మూలపడ్డది. కమాను విరిగి పెంటకుప్పని చేరింది. జీవితం లోంచి సంగీతం తొలగిపోయినా ఎదురింటి అమ్మాయి పాడుతూవుంటే ఎక్కడలేని సుఖాన్ని, సంతోషాన్ని ఇస్తున్నది.

రాజ్యానికి జీవితంలో అసందర్భంగా ఏమీ జరగలేదు. అంతా సవ్యంగానే నడిచింది.

ఆరేళ్ళక్రితం రాజ్యాన్ని చూడడానికి పెళ్ళివారు వచ్చారు. వాళ్ళతో వెంకటప్పయ్యా వచ్చాడు. వాళ్ళంతా రాజ్యాన్ని పాడమన్నారు. వాళ్ళ నాన్న నాలుగేళ్ళయి అనవసరంగా సంగీతం చెప్పిస్తున్నందుకు పాడవల సిన శుభముహూర్తం వచ్చింది.

తోడిలో కీర్తన సిగ్గుపడుతూ అందుకుంది. గొంతుకెత్తేసరికి అప శృతి పలికింది. ఉసిలోకి రావలసిన తాళం వేలుమీదకొచ్చింది. వొళ్ళంతా జలదరించి పాటంతా గాభరా అయిపోయింది. పాట అపగానే రాజ్యానికి ఏడుపు పర్యంతం అయిపోయింది.

కాని వచ్చిన పెళ్ళిపెద్దలు పాటకు సెహబాస్ అన్నారు. తెనుగు పెద్దలకి శృతీ, అపశృతీ తెలియవని, రాగ తాళ జ్ఞానం వాళ్ళకుండదని, వాళ్ళ జీవితాలలో సంగీతం లేనేలేదని అమాయకపు పెళ్ళికూతుళ్ళకి ఏమి తెలుసు.

"మీ అల్లుడు ఉద్యోగం చెయ్యక్కర్లేదు." అన్నాడొక పెళ్ళిపెద్ద. రాజ్యం వాళ్ళ అజ్ఞానానికి లోలోపల నవ్వుకొంది.

వెంకటప్పయ్య రాజ్యాన్ని మనసారా అంగీకరించే పెళ్ళిచేసు కొన్నాడు. పేరు వెంకటప్పయ్య అయినా వెంకటప్పయ్యా అల్లాటప్పయ్యా కాడు. పెళ్ళి నిశ్చయంకాగానే రాజ్యంకూడా తను అదృష్టవంతురాలిననే అనుకొంది. వెంకటప్పయ్య పెళ్ళినాటికి పట్టపగ్గాల్లేని ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారి పట్టభద్రుల్లో ఒకడు! చెన్న రాష్ట్ర ప్రభుత్వపు డెబ్బయి రెండురూపాయల ఎల్.డి. గుమాస్తాలలో ఒకడు.

పెళ్ళయిన కొత్తలో వాళ్ళ కోడలు రాజ్యం మాబాగా పాడుతుందని ఊళ్ళోవాళ్ళు పేరంటానికి వెళితే బలవంతంచేసి పాడించేవారు. మొగుడు ఒక్కనాడు పాడమనలేదు. తాను పాడనూలేదు.

సిగ్గువదలి అత్తవారింట్లో తనకి తాను నోరెత్తి పాడుకొనే సమయం రాకుండానే పుట్టిమునిగిపోయినట్టు వేవిళ్ళతో పుట్టింటి కెళ్ళింది. దాంతో అడజన్మ సార్థకమైంది.

వసారాలో పిల్లలు గందరగోళం ప్రారంభించారు.

"ఎందుకర్రా అలాగ పీక్కుతింటారు? ఇలాగ రండి" అన్నది. కుస్తీలు పడుతున్న కొడుకులిద్దరు తల్లిదగ్గరకొచ్చారు. ఐదేళ్ళవాడొకడూ, నాలుగేళ్ళ వాడొకడూ.

"తమ్ముడు నిద్రపోతున్నాడా?" అనడిగింది.

"గుర్రు పెడుతున్నాడు" అన్నాడు పెద్దవాడు.

"అల్లరిచేస్తే లేచిపోడూ?" అన్నది. పెద్దవాడు కొంటెగా నవ్వాడు. ఇద్దరూ పొరపాటు చేస్తున్నట్టు మొహాలు పెట్టారు.

"ఎదురింటి అమ్మాయి హాయిగా పాడుతున్నది. కూచుని చక్కగా వినండి" అన్నది. వాళ్ళు బుద్ధిగా కూచున్నారు. పిల్లలని సముదాయించడం, శాంతంగా సబవైన మాటలుచెప్పి అల్లరి చేయకండా చెప్పినట్టు వినేటట్టు చెయ్యడం, మొహంమీదకి పొగరాకుండా పొయ్యి ఊదడం మొదలైన విద్యలన్నీ రాజ్యం అవలీలగా నేర్చుకొంది.

ఎదురింటి అమ్మాయి స్వరకల్పన ప్రారంభించింది. స్వరాలు సెలయేళ్ళలాగ ప్రవహిస్తూ, మధ్య మధ్య జలపాతాల్లాగ తిరగబడి మోషిస్తున్నాయి. గాత్రం తారాస్థాయికి లేపి గాంధారంలో నిలుపుతూ కల్పన చేస్తున్నది.

రాజ్యానికి ఏనుగంత సత్తువ వచ్చింది. నిత్యజీవితంలో ఆనందానికి, ఆరోగ్యానికి సంగీతం అవసరమే. తాను పాడలేకపోయినా అర్థం చేసుకోగలిగితే ఉత్తమ సంగీతం మంచిని చేస్తుంది.

అడ్డంగా పానకంలో పుడకలాగ ఎదురింటి అమ్మాయి తమ్ముడు కాబోలు వచ్చాడు.

"గిమపదని ఓజగ...."

"సరిసనిపదని ఓజగ...." అని గొంతుక చించుకొని అపశృతిలో స్వరాలు వేశాడు. ఆ అమ్మాయి తంబూరా పాటా ఆపేసింది.

"వెధవా సంగీతం నేర్చుకోమంటే రావుకానీ అల్లరికి సిద్ధం" అన్నది.

"నేను స్వరం సరిగ్గా వెయ్యలేదూ?" అని ప్రశ్నించాడు.

"నాన్న రానీ చెపుతాను" అన్నదా అమ్మాయి.

"దానిపనిసరి సానిదాని పదని ఓజగ....!" అంటూ కుర్రవాడు మరోస్వరం వేశాడు. అపశృతిలోనైనా కుర్రవాడు స్వరాలు సరిగ్గానే పట్టుకు వేస్తున్నాడు. వాతావరణంలో సంగీతం ఉంటే వాసాలుకూడా పాడతాయి. అందులో గగనంలేదు.

"నాన్నరానీ వెధవా" అని ఆ అమ్మాయి సంగీతం ఆపువేసేసింది. రాజ్యానికి వొళ్ళు మండిపోయింది. ఆ పిల్ల అన్నీ తనకొచ్చిన రాగాల్లో కృతులే పాడుతున్నది.

"కొంచెంసేపైనా ప్రాణం హాయిగా ఉంది. ఇహనైంది సంగీతం" అన్నది రాజ్యం.

"ఇంక పాడదేంటమ్మా?" అని పెద్దకొడుకు అడిగాడు.

"అదిగో మీలాటి అల్లరి కుర్రవాడువచ్చి కంగాళీచేస్తే కోపంవచ్చి పాట మానేసింది."

"ఎలాగమ్మా పాడుతున్నది?"

"నేర్చుకొని పాడుతున్నది."

"నువ్వు పాడతావూ?"

"ఓ పాడతాను. నీకు చెప్పమన్నావా?"

"ఛీ! మొగాళ్ళు పాడరు."

"మొగాళ్ళూ పాడతారమ్మా నీకు చెప్పమన్నావా?"

"ఏదీ చెప్పు."

"తరవాత చెపుతాలే" అని రాజ్యం కాళ్ళుజాపి గదిలో అడ్డంగా పడుకుంది.

"ఒరే పెద్దాడూ కాళ్ళు పట్టుబాబూ" అంది. పెద్దవాడు మెల్లిగా కాళ్ళు గుద్దుతూ కూచున్నాడు.

"నేను చేతులు గుద్దుతానమ్మా" అంటూ రెండోవాడు చేతులు గుద్దుతూ కూచున్నాడు.

రాజ్యం కళ్యాణి కృతి అనుకొంటూ పడుకుంది. అంతా మరచిపోయింది. సంగతులు చిక్కుపడ్డ కురుల్లాగ అవకతవక అయిపోయాయి.

"నువ్వా పిల్ల లాగ పాడ్డంలేదు" అన్నాడు పెద్దవాడు.

"అంతా మరచిపోయానురా" అన్నది. పెరటి వసారగూట్లోంచి సిబ్బి కిందపడి వికారంగా చప్పుడై గదిమూలలన్నీ గుయ్యిపెట్టాయి.

"కుక్క కాబోలు కొట్టండి. గూట్లో అన్నం మండబెట్టింది కాబోలు!" అన్నది రాజ్యం. కొడుకులు పరిగెట్టారు.

"కుక్క కాదమ్మా పిల్లి. అన్నంగిన్నెమీదా సిబ్బి తిరగదోసింది" అన్నాడు పెద్దవాడు.

"నయమే. మళ్ళా వండుకోకండా. కుక్క ముట్టుకున్న కూడూ తినవలసిన రోజులు. తలుపులు గడియ పెట్టిరావొద్దూ?" అన్నది రాజ్యం.

"నువ్వేవచ్చి సంగీతం వినమన్నావు" అన్నాడు పెద్దకొడుకు.

"ఔనమ్మా నేనే మిమ్మల్ని రమ్మన్నాను కాని తలుపులు వేసి రావాలి. తెలిసిందా!" అని మెల్లిగా చెప్పింది.

వెంకటప్పయ్య తిరిగి వచ్చేశాడు.

"పెరట్లో వెన్నెలా, పువ్వు వెలగవాసన మహబాగున్నాయి" అన్నాడు వెంకటప్పయ్య.

"అప్పుడే వచ్చేశారేం?" అన్నది రాజ్యం.

"పనై పోయింది"

"పాపపరిహారం అయిందా?"

"కొంచం అయింది"

"ఈ మధ్య ఎక్కడికో వెళ్ళారు కాబోలు"

"రామరామ"

"మీ మాటలు వాళకం అలాగుంది"

"ఛీఛీ!"

"ఆమాట అనలేనులెండి."

వెంకటప్పయ్య కండువాలో దాచి చంకక్రింద ఏదో పెట్టాడు. గుండ్రంగా పేపరుచుట్టి ఉంది.

"ఏమిటిది?" అన్నది రాజ్యం.

"విప్పి చూపిస్తాను కదూ"

లోపల బాగా నాలుగువేళ్ళ వెడల్పుచుట్టు జరీ అంచు చీర ఉంది. దానికి తగ్గ పట్టు రవికలగుడ్డా ఉంది. మహారాణి మొదలు మామూలు మహిళదాకా ప్రతి ఆడదీ మెచ్చుకునే చుట్టుజరీచీర.

"కొన్నారా?"

"కొన్నాను. ఉన్నడబ్బుకాస్తా అయిపోకండా కొనేశాను."

"డబ్బెక్కడిది?"

"చెపితే నువ్వు నన్ను క్షమించవు"

"ఏంచేశారండీ?"

"ఏమీ అనని చేతిలో చెయ్యివెయ్యి" అన్నాడు. ముందుకు చెయ్యి జాపేడు. వాడి చెయ్యి వణుకుతున్నది. రాజ్యం చేతిలో చెయ్యివేసింది.

"అలాగ వణికిపోతున్నారేం? ఏం చేశారండి? దొంగతనం చెయ్య లేదుకదా?"

"అంతకన్నా హీనమైనదే. నీకు టైఫాయిడు మళ్ళా తిరగబెట్టింది కదూ. నాకు ఆశలన్నీ ఉడిగిపోయాయి. స్నేహితుడొకడు ఇంటికివచ్చి చూసీచూడ్డంతో సలహా ఇచ్చాడు. తెగించి వాడికిచ్చేశాను."

"ఏమిటిచ్చేశారు?"

"నీ కింకా తెలియలేదు. వాడే పట్టుకెళ్ళి రెండువందల ఏభైకి అమ్మేశాడు. అంతడబ్బు వస్తుందని కలలోకూడా అనుకోలేదు. పాతదను కున్నాను. పాతదానికే విలువ ఎక్కువట."

రాజ్యానికి అర్థమైంది. గది నాలుగుపక్కలా కలియజూసింది.

"ఇహ నువ్వు చూడనక్కర్లేదు"

"వెళ్ళిపోయిందా?" అని దీర్ఘంగా నిట్టూర్చింది.

"నీకు కష్టంగా ఉంటుందని తెలుసు. నేను చేసింది తప్పే" అని నేరస్తుడిలాగ మొహం పెట్టుకున్నాడు. మొగుడి మనస్సు బాధపడుతున్న దని గ్రహించి తన విచారాన్ని క్షణంలో దిగమింగుకుంది.

"ఏ తప్పూ చెయ్యలేదు. ఏ సంసారైనా అదే చేస్తాడు. చెయ్యవలసి వచ్చి చేశారు. మీరేం తినేశారా?"

"మనకంతా మొగపిల్లలే కదా అని ధైర్యం చేశాను"

"పోనియ్యండి, నానోరు ఏనాడో నొక్కుకుపోయింది. ఇహ నా ఫిడేలు ఉండి నన్ను రక్షిస్తుందా? సరస్వతీ కటాక్షం నాకంతే ఉంది. తల్లి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతూ తల్లి తల్లిగుణాన్ని చూపించుకొంది. నాకు ప్రాణం పోసింది. వెళ్ళిపోతూ నాకో చీరా రవికలగుడ్డా పెట్టింది" అని గుడ్లనిండా నీళ్ళు నింపుకొంది. ఎదురుగుండా ఉన్న చీరని రాజ్యం విప్పి యినా చూడలేదు.

"నాలుగు కాలాలపాటు ఉంటుందికదా అని కొనేశాను" అని చీర సగం విప్పేసి రాజ్యం భుజంమీద కప్పేశాడు వెంకటప్పయ్య.

"జ్ఞాపకంగా ఉంటుంది లెండి" అన్నది రాజ్యం.